# పెళ్ళికూతురు

"ఎంత దారుణం! ఇంతకూ పాపం, మూడో పెళ్ళి గీతకూడా వుంద కామల్లు" అన్నాడు రాఘవయ్య దీనంగా.

వెంకటేశ్వర్లుగారు చిరునవ్వాపుకుని దీపం కొద్దిగా పెద్దది చేసి బాల్య స్నేహితుడి వంక చూస్తూ వూరుకున్నాడు.

రాఘవయ్య సూటిగా వెంకటేశ్వర్లుగారి మొహంవంక చూసి పదేళ్ళయింది. అంతక్రితం రాఘవయ్య, వెంకటేశ్వర్లుగారు కూడా కొంచం అటూ యిటూగా తన హోదాకు సమానమైన హోదాగల వాడే నన్నట్టు నటించాడు. కాని పదేళ్ళకిందట రాఘవయ్య కొన్ని పరిస్థితులవల్ల దివాలా యెత్తటం, వెంకటేశ్వర్లుగారొక్కపట్టున మరో ఇరవై యెకరాలు సుక్షేత్రమైన మాగాణీ భూములు కొనటం జరిగింది. భగవంతుడింత పక్షపాతంతో ప్రవర్తించటం రాఘవయ్యకు చాలా ఆగ్రహ కారణమైంది. కాని వెంకటేశ్వర్లు తన

బాల్యస్నేహితుడని నలుగురి చెవులా వేస్తూండటం చాలా అవసరమనీ, తనికమీద ఆయనవంక తేరిచూడలేకపోవటం వల్ల తనకు కలిగే హాని ఏమీ లేదనీ తీర్మానించుకున్నాడు రాఘవయ్య. ఆ పెద్దమనిషి యిష్ట ప్రకారంగానే వెంక టేశ్వర్లుగారి దృష్టితప్పించి ఇల్లంతా కలియచూసి, "యెలాగైనా యింటికి సంబంధించిన జ్యోతి లేకపోయిన తరవాత యిల్లు కళావిహీనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమిటి? మళ్లీ కొంతకాలం ఇలా-"

"తరవాత?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

తన ధోరణిలో తను అనదలుచుకున్న ముక్క వెంక టేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానంగా అనాలంటే రాఘవయ్యకు ఒక్క క్షణం నోరు పట్టేసింది-పాడబోతున్న వాణ్ని పాడమన్నట్టు. కాని చాలా డక్కాముక్కలు తిని చేవదేలిన ఘటం కాబట్టి తట్టుకున్నాడు.

"తరవాత యేముందీ? కల్యాణం! ఆగుతుందా ఏమిటి?"

"నాకింకా ఆ మాట తట్టలేదు సుమా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

ఆయన మాటలో ఎక్కిరింపు రాఘవయ్య గమనించ లేదు.

"తట్టలేదూ! యింకా నీదగ్గిరికి ఎవరూ రాలేదే మిటి? నాతో నీ విషయం నలుగురైదుగురు ప్రస్తావించారు.

చిన్నవాడు, జమీందారు, బుద్ధిమంతుడు, మంచి పదవిలో వున్నవాడని శిఫార్సు చేసాను."

"ఎవరు చిన్నవాడు?"

"నువ్వే, ముప్ఫై అయిదేళ్ళవాడు ముసలివాడా ఏమిటి?"

"మనిద్దరికీ ఒక్కసారే అక్షరాభ్యాసమయింది. తెలుసునా? నీ వయస్సెంత?"

రాఘవయ్య ఆశ్చర్యం నటించాడు. ఆయన వయస్సు నలభై అయిదు కేమాత్రమో ఎక్కువేకాని తక్కువ కాదు.

"అయితే మాత్రం! డెబ్భైఏళ్ళకు పునర్వివాహం చేసుకున్నవాళ్ళున్నారు"

"యిచ్చేవాళ్ళుంటే..."

"నీ కిచ్చేవాళ్ళే లేరా? ఎనభైమంది పిల్లలు దొరుకుతారు. ఆ పూచీ నాది. కాని అన్నివిధాలా తనువైన పిల్ల నేను చూసినంతట్లో-"

"యిచ్చేవాళ్లు నన్ను చూస్తారా? నా ఆస్తి చూస్తారా?"

'అది చాలా కష్టమైన ప్రశ్న. కాని నిన్నుచూసి యిచ్చేవాళ్లు లేకపోలేదు."

"ఒకర్ని చెప్పు"

"నేను" రాఘవయ్య చిరునవ్వు నవ్వాడు.

వెంకటేశ్వర్లుగారు భావరహితమైన మొహంతో

రాఘవయ్యవంక నిదానించిచూశాడు. రాఘవయ్యనైచ్యాన్ని గురించి ఆయన కేవిధమైన అనుమానం ఎన్నడూ లేదు.

"నేనూ మా శారదాంబకు ఎక్కడ తగిన సంబంధం దొరుకుతుందా అని చూస్తున్నాను, వెంకటేశ్వర్లూ! యిదే యింకోళ్ళయితే తొందరపడి పెళ్ళిచేసుకోమన్నా. కాని నా దగ్గిర నీకు అనుమానం ఎందుకు? చిన్నప్పటినించీ పిల్లదాన్నెరుగుదువు కదా! దాని అంద చందా లెరుగుదువుకదా! దాన్నింకొకరి కివ్వటానికికూడా నా కిష్టంగా లేదు"

వెంకటేశ్వర్లుగారు మాట్లాడలేదు. రాఘవయ్యకు కొద్ది నిరుత్సాహం కలిగినా వెనక్కి తియ్యలేదు, ఆ వేడి మీదనే మరిరెండు దెబ్బలుకొట్టి చూద్దామనుకున్నాడు.

"నీ కెలాగో పెళ్ళి కావలసి వుంది. నాపిల్లకూ వివాహం కావాలి. నీతో సంబంధమంటే నా కెంత ఉత్సాహంగా వుందో నీకూ అంత ఉత్సాహంగానే వుందని అనుకుంటున్నాను. ఆలోచించుకో. కొత్తవాళ్ళతో సంబంధం చేసుకొని పెళ్ళయిన మర్నాటినించీ సకలమైన నసా. ...డం కంటె స్నేహితంలో బాంధవ్యం—"

వెంకటేశ్వర్లుగారు ఏ సమాధానం చెప్పకుండా సరిగా అయిదునిమిషాలు కూర్చున్నా డాలోచిస్తూ.

"ఒక్కసారి మీ పిల్లతో నేను మాట్లాడాలి."

"అంతకన్నానా! ఇప్పుడే మా యింటికి పోదాం పద!"

రాఘవయ్య ఉత్సాహం చెప్పటానికి వీల్లేదు.

"శే పుదయం ఎనిమిదింటికి వస్తాను సరిగా"

రాఘవయ్య తన కుమార్తె వివాహం అయిపోయి నట్టే భావించుకున్నాడు. ఇక తనకు డబ్బుకొరత లేదు ఎస్టేట్ కంతా తనే మేనేజరు. ఇంత ఆస్తీ తనకూతురి సంతానానికే వస్తుంది. వెంకటేశ్వర్లుగారికి ప్రథమ కళత్రంవల్ల కలిగిన కుమారుడు లక్ష్మీకాంతం వున్నాడు. మొదటినించీ శారదకు, ఆ పిల్లవాడికీ స్నేహం. రాఘవయ్య దృష్టి చాలాకాలం లక్ష్మీకాంతంమీద వుంటూ వచ్చింది. తనకుమార్తె ఇంకా పసిపిల్లగా ఉన్నరోజుల్లోనే "అదుగోనే బావ, బావను పెళ్ళి చేసుకుంటావమ్మా?" అంటుండేవాడు రాఘవయ్య. కాని ఇప్పుడదంతా పోయింది. మూడేళ్ళకింద వెంకటేశ్వర్లుగారు కొడుకును యింట్లోనుంచి వెళ్ళగొట్టాడు. మళ్లీ తండ్రీ కొడుకులు ఒకరిమొహం ఒకరు చూసుకోలేదు. ఈ వైరానికి - లక్ష్మీకాంతానికీ, సవతితల్లికీ ఏదో సంబంధం వున్నదని తప్ప మిగిలిన విశేషా లెవ్వరికీ తెలీలేదు. తండ్రి కొడుకు లిద్దరూ ఆ విషయం ఎవరితోనూ యెత్తలేదు. లక్ష్మీకాంతం నిర్దోషి అనుకోటానికయినా ఈ మూడేళ్ళనించీ అతన్ని గురించి చాలాచెడ్డకబుర్లు వినపడుతూ వచ్చినై.

వెంకటేశ్వర్లుగారి రెండో భార్యా పోయినతరవాత కూడా తండ్రి కొడుకులు కలవకపోవటం చూసి శారదకు ముసలాడు తప్పడనుకున్నాడు రాఘవయ్య. యిక లక్ష్మీకాంతం పిత్రార్జితానికి బాహ్యుడే. పాపం రాఘవయ్య ప్రయ

త్నాని కన్నీ అడ్డాలే అయినై. చివరకు వెంకటేశ్వర్లును చూడబోయ్యేటప్పుడుకూడా యింతా చేస్తే వెంకటేశ్వర్లు మళ్ళీ పెళ్ళి చేసుకుంటానంటాడో లేదోనని అనుమానమే. యింతకు భగవంతుడు తనయందుండ బట్టే-

తన స్నేహితుణ్ని వసారా గదిలో కూర్చోబెట్టి రాఘవయ్య అదివరకే పూర్తిగా అలంకరించి వున్న శారదను తెచ్చాడు.

"మే మిద్దరం కాస్సేపు రహస్యంగా మాటలాడుకోవాలి. నువ్వేదైనా పనివుంటే చూసుకో" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

రాఘవయ్య మనస్సులోనే 'అంతకంటేనా!' అనుకుని బయటికి నిష్క్రమించాడు.

"పరవాలేదు, తలుపు తెరిచే వుండనీ" అన్నాడు వెంకటేశ్వర్లు రాఘవయ్య తలుపవతలనించి సంభాషణ వినటాని కవకాశం లేనందువల్ల హతాశుడై తలుపు తెరిచి వెళ్ళిపోయినాడు.

వెంకటేశ్వర్లు శారదను చూసి "మా లక్ష్మి బతికుంటే ఈపాటి కీ పిల్ల వయస్సుది, ఇంత బాగుండేదేమో కూడా" అనుకున్నాడు. శారద మాత్రం ఆయన్ని లక్ష్యం చెయ్యకుండా కొంచంసేపు అటూ ఇటూ పచారుచేసి చివరకు అలమారు దగ్గిరికి పోయి తన వొంటిని ఉన్న రొండు మూడు నగలూ తీసేసి అలమారలో పెట్టి తీరిగ్గా జడ విప్పుకోటం మొదలుపెట్టింది.

"అమ్మాయి! నీ కెన్నేళ్లు?" అన్నాడు వెంకటేశ్వర్లు గారు.

శారద కనుబొమలు ముడేసి "మీ కన్న నల్భై ఏళ్లు తక్కువ" అన్నది.

వెంకటేశ్వర్లుగారు నవ్వేడు. "ఆఁ!అంత అన్యాయంగా వుండదు. పదేళ్ళయినా లేవా నీకు?"

"ఇంకా రెండేళ్ళెక్కువే."

"జుట్టు విరబోసుకున్నా అందంగానే వున్నావు. పెళ్ళి కూతుర్ని చేస్తే ఇంకా బాగుంటావు. నేను వచ్చిన పని తెలుసునా ?"

"ఆఁ ! నా గొంతు కొయ్యటానికి. నా గొంతంత సులభంగా తెగదు"

"ఏమంత మాటన్నావు ? నీకు కల్యాణం అయ్యే ఏర్పాటు చేద్దామనుకుంటున్నానే!"

శారద ధైర్యంగా వెంకటేశ్వర్లుగారిని సమీపించి ఆయనవంకే చూస్తూ నిలబడ్డది. నడుముకు చేతులు కట్టు కోటం ఒక్కటే తక్కువనుకున్నాడు వెంకటేశ్వర్లుగారు. ఆయన కప్పుడే ఆ పిల్లను చూస్తే భయంకూడా ప్రారంభ మయింది.

"నన్ను మా నాన్న మీకిచ్చి చేస్తే నూతిలో పడ తాను. జ్ఞాపకం వుంచుకోండి. నే నాడపిల్లలందరిలాంటి దాన్ని కాను.మా అమ్మ నన్నెప్పుడు శక్తి,అని పిలుస్తుంది"

కిటికీలోనించి గాలివచ్చి ఆ పిల్ల జుట్టు అటూ ఇటూ కొట్టేస్తున్నది.

"దాదాపు అలాగే వున్నావు, అయితే నన్ను చూస్తే నీకంత మంచి అభిప్రాయం కలగటానికి కారణం?"

"మీరు మనిషి కాదు. అయితే కాంతాన్ని పెళ్ళాం మాటలు నమ్మి ఇంట్లోనించి వెళ్ళగొడతారా?"

వెంకటేశ్వర్లుగారు కొంచంసేపు జవాబు చెప్పలేదు.

"నువ్వందరితో ఇలాగే మాటలాడుతావా?"

"మాటలాడను"

"నాతో నేనా?"

"ఆఁ"

కొంచంసే పిద్దరూ మౌనంగా ఊరుకున్నారు.

"కాంతంగల్ల తప్పు లేదని నీకేం నమ్మకం?"

"నాకు తెలుసు, నేను కాంతాన్ని ఇంతదాన్నప్పటి నుచీ ఎరుగుదును."

"నే నెరుగనా?"

"ఎరగరు."

'ఇప్పుడు కాంతం ఎవరితో తిరుగుతున్నాడు తెలుసునా?'

'ఆఁ'

'రౌడీలు, భోగంవాళ్ళు.'

'మీకన్నా, మీ పెళ్ళాంకన్నా మంచివాళ్ళే.'

వెంకటేశ్వర్లుగారు దీనంగా నవ్వాడు.

'నీకెలా తెలుసు?'

'లేకపోతే కాంతం వాళ్ళతో యిన్నాళ్ళు కలిసి వుండడు.'

'కాంతం ఉన్నచోట చెడుండదా!'

'వుండదు'

'నీ కింత ధైర్యంగా మాట్లాడటం ఎవరు నేర్పారు?'

'మీ అబ్బాయి'

శారదకు కాంతం స్నేహితం కాక శిష్యత్వంకూడా వుందన్నమాట!

'కాంతం ప్రతిరోజూ ఇక్కడికి వస్తుంటాడా?'

'ఆ.'

'నా విషయం ఏమన్నా అంటాడా?'

'అనడు. తన నోటివెంట మీ విషయం ఎప్పుడన్నా మాట తూలిపస్తే ఆ రోజునించీ తనతో నన్ను మాటలాడ వద్దన్నాడు.'

వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపడి 'ఎందుకు?' అన్నారు.

'తెలివిగలవాడు కనక.'

'అయితే అటువంటి దేదైనా జరిగితే వాడితోమాట లాడటం మానేస్తావా?'

'మానను'

'ఏం?'

'మిమ్మల్ని తిట్టటానికి నాకేమీ అభ్యంతరం లేదు-'

'అందరాదవాళ్ళు యిలా మాట్లాడటం నీ కిష్ట మేనా!'

'అందరి కొడుకులూ శాంతం స్థితికి రావటం మీ కిష్టమా?'

'లేదు'

'నాకూ లేదు.'

'అది శాంతం తప్పేమో.'

'కాదు. అయితే ఇదీ నా తప్పే'

'అయితే వాడికోసం నువ్విట్లు మారిపోయినావా?'

'ఆ.'

వెంకటేశ్వర్లుగారు నవ్వుతుంటూ 'నిన్నింకా ఎంతసేపు పరీక్ష చెయ్యాను' అనుకున్నాడు బిగ్గరిగానే.

'యింతసేపు నన్ను పరీక్ష చెయ్యండి అని మిమ్మల్ని జొట్టు కాటిక పెట్టి నేను పిలవలేదు. బహుశా మా నాన్న నడిగితే తెలుస్తుంది. యింకా ఎంతసేపు పరీక్ష చెయ్యాలో.'

'మా శాంతంవల్ల తప్పులేదని చాలాకాలం కిందటనే కనిపెట్టాను.'

మీ కా మాట అనటానికి నామోషీ లేదా? నిజం తెలిసిన తక్షణం వెళ్ళి మీ అబ్బాయి కాళ్ళెందుకు పట్టుకో లేదు?'

'నా చేత కాలేదు. తగిన సమయంకోసం ఎదురు చూస్తున్నాను'

'మీ అబ్బాయే పొరపాటుపడితే తెలిసినవెంటనే పోయి కాళ్లు పట్టుకుంటాడు.'

'అవును వాడికి తల్లి మంచిగుణాలన్నీ వచ్చినై.'

'అటువంటి భార్యపోతే పశువైతే తప్ప తిరిగి పెళ్ళి చేసుకోడు'

'నీ యిష్టంవచ్చినట్టను. నేను మొండెత్తు వేశాను. చాలాకాలం క్రిందనే నా గుండె రాయియిపోయింది. యిక అరిగి పోవలిసిందేకాని కరగదు.'

ఈ మాట కేవలం నిజంకాదు. ఆ మాట అంటుండగానే ఆయనకళ్లు చెమ్మగిల్లినై.

శారద తనకు పరాజయం ప్రారంభమైందని కనుక్కుంది.

'ఇలా రా అమ్మా!' అన్నాడు వెంకటేశ్వర్లుగారు. శారద మారుచెప్పకుండా మెల్లిగా వచ్చి ఆయన పక్కనే నిలుచుంది.

'జడవేసుకోమ్మా. నిన్ను మా కాంతంకిచ్చి చేస్తాను. ఒక ఆడది మమ్మల్నిద్దర్నీ వేరుచేసింది. మళ్లీ మమ్మల్నిద్దర్నీ కలపటం నావంతు.' శారద తలవంచుకుంది.ఆ పిల్ల కళ్ళనించి రెండుబొట్లు రాలటం వెంకటేశ్వర్లెరగడు.కాని ఆయనకళ్ళ నించి కారిన బిందువులు తన తలమీద పడటం శారద గమనించి అవే అక్షింతలకింద గ్రహించింది.